క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్నాయి. బైపీసీ, ఎంపీసీ, తరగతులకు ప్రతి గ్రూపు నుంచి 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కె శిరీష తెలిపారు. ఈనెల 12వ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

టీబీని నిర్లక్ష్యం చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ముస్తాబాద్: క్షయ ముక్త్ భారత్ నిర్మాణానికి ప్రజలు కలిసి రావాలని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గీతాంజలి అన్నారు. బందనకల్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, రాత్రి చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలున్న వారు పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ సోకిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. టీబీని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సూపర్‌వైజర్ మహిపాల్, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఎల్ హెచ్‌పీ ఉదయ్, ఏఎన్‌ఎమ్‌లు, తదితరులున్నారు.

సభకు తరలిరావాలి



గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో జిల్లావ్యాప్తంగా ఉన్న యాదవులతో కలిసి యాదవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ తెలిపారు. కొత్తపల్లిలో మంగళవారం స్థానిక యాదవ సంఘం నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలోని యాదవులంతా సభకు తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవుల సమస్యల పరిష్కారం కోసం తాము కృషి చేస్తామన్నారు. సమావేశంలో పెద్దవేని వెంకటి, మల్లేశం, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘ఒకే దేశం ఒకే ఎన్నిక ’

కోనరావుపేట : మండలంలోని బావుసాయిపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్కర్ బాలాజీ అధ్యక్షతన ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కో కన్వీనర్ సురభి సురేశ్ రావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బర్క రమేశ్ , బూత్ అధ్యక్షులు గుంటి పరశురాములు, గోవిందరావు పేట బూత్ అధ్యక్షులు ఆంగోత్ సంతోష్, లావుడ్య తిరుపతి, ఎక్కలదేవి కొమురయ్య , బైరగోని శ్రీనివాస్, బైరగోని వెంకటేశం, ఎక్కలదేవి వేణు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్ ఎస్సైగా అంజయ్య

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ ఎస్సైగా అంజయ్య బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎస్సైగా పని చేసిన మారుతి గతనెల 31న ఉద్యోగ విరమణ పొందడంతో చందుర్తి ఎస్సైగా పనిచేస్తున్న అంజయ్యను వేములవాడ రూరల్ ఎస్సైగా బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేత కార్మికులు బీమా చేయించుకోవాలి

ముస్తాబాద్: నేత కార్మికులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని కమ్యూనిటీ ఫెసిలిటేటర్ వేముల మార్కండేయులు కోరారు. మండలంలోని గూడెంకు చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా, మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేశామన్నారు. త్రిఫ్ట్ పథకంతోపాటు బీమా పాలసీలో కూడా ప్రతి కార్మికుడు విధిగా చేరాలన్నారు. తాము పనిచేసే కార్ఖానాలోనే యజమాని వీటికి సంబంధించిన వివరాలు అందజేస్తారన్నారు. కార్మిక కుటుంబాన్ని ఆదుకునేందుకు చేనేత జౌళిశాఖ ద్వారా ప్రయత్నిస్తామన్నారు.

ఎగ్‌ఫ్రైడ్ రైస్‌లో జెర్రపురుగు

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చిన ఓ కుటుంబం మంగళవారం జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఎగ్‌ఫ్రైడ్ రైస్ ఆర్డర్ చేసుకుని తింటున్నారు. అందులో జెర్ర పురుగు కనిపించడంతో వెంటనే సదర్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని నిలదీయడంతో భక్తుల మీదే దాడికి ప్రయత్నించారు. గొడవ తీవ్రస్థాయికి చేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకునేసరికి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని షాప్‌ను మూసేసి వెళ్లినట్లు బాధితులు తెలిపారు.

కళావిహీనంగా క్రీడా ప్రాంగణాలు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న బావుసింగ్ నాయక్ తండా క్రీడా ప్రాంగణం



పరికరాలు లేని రంగంపేట క్రీడాప్రాంగణం

- పిచ్చి మొక్కలతో దర్శనం
- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- క్రీడా పరికరాలు లేక ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

వీర్నపల్లి: గత ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో పేరుకే బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇంకొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా సరైన సౌకర్యాలు కల్పించలేదు. కొన్ని పాఠశాలల ఆవరణలో, గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. పిచ్చిమొక్కలు పెరిగి కళావిహీనంగా తయారయ్యాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటివరకు రంగంపేట, గర్జనపల్లి గ్రామపంచాయతీలో క్రీడలకు అనుకూలంగా ఆట స్థలాలున్నాయి. కానీ ఇక్కడ క్రీడా పరికరాలు ఏర్పాటు చేయలేదు.

క్రీడా మైదానాలు ఉండాల్సింది ఇలా...

- క్రీడల కోసం కనీసం ఎకరం స్థలం గ్రామానికి దగ్గరలో ఏర్పాటు చేయాలి.
- క్రీడామైదానం చుట్టూ మొక్కలు నాటాలి.
- పిచ్చిమొక్కలు తొలగించి క్రీడా మైదానం చదును చేయాలి.

క్రీడా పరికరాలు లేవు



గ్రామంలో క్రీడాప్రాంగణం ఉన్నా క్రీడా పరికరాలు ఏర్పాటు చేయలేదు. పేరుకు మాత్రమే బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో క్రీడలు ఆడుకునేందుకు వీలులేకుండా పోయింది. వెంటనే క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలి.

– భూత వినోద్, వీర్నపల్లి

బోర్డులకే పరిమితం



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు బోర్డులకు పరిమితమవుతున్నాయి. కొన్నిగ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లోనే ధాన్యం ఆరబోసే పరిస్థితి. అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించాలి

– జాలపెల్లి మనోజ్ కుమార్, అడవిపదిర

పరికరాలు అందిస్తున్నాం



మండలంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలతో పాటు పరికరాలు సమకూర్చుతున్నాం. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలి.

– అబ్దుల్ వాజిద్, ఎంపీడీవో, వీర్నపల్లి

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



సిరిసిల్ల : చంద్రంపేట రైతువేదికలో రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి



వేములవాడఅర్బన్: రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

సిరిసిల్ల: నాణ్యమైన విత్తనాలను సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం పేర్కొన్నారు. చంద్రంపేట రైతువేదికలో మంగళవారం రైతులకు విత్తనకిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన విత్తనాల కిట్లను రైతులకు అందించామన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ అగ్రికల్చర్ కాలేజీ అసోసియేట్ డీన్ సునీత, సిరిసిల్ల వ్యవసాయాధికారి సందీప్, ఏఈవోలు లతశ్రీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక రైతు వేదికలో నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి, పెసర విత్తనాలు అందించారు. బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్ల వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవి, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, గణేశ్, విద్యాసాగర్, వ్యవసాయ డివిజనల్ అధికారి రామారావు, మండల వ్యవసాయ అధికారి, తదితరులు ఉన్నారు.

బోయినపల్లి: పంటల సాగులో నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి సాధించవచ్చని బీజేఆర్ జిల్లెల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రజియా, ఎంఏఓ కే.ప్రణీత పేర్కొన్నారు. కొదురుపాక రైతువేదికలో నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: నాణ్యమైన విత్తనంతో లాభసాటి వ్యవసాయం సాధ్యమని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. ముస్తాబాద్ రైతువేదికలో నాణ్యమైన వరి కిట్లను రైతులకు పంపిణీ చేశారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రియదర్శిని, వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, వ్యవసాయాధికారి దుర్గరాజు, ఏఈవోలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మర్రిపల్లి రైతు వేదికలో విత్తనాలు పంపిణీ చేశారు. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఎంసీ చైర్మన్ రొండి రాజు అన్నారు. డా.పి.మాధవి(బాబు జగ్జీవన్ వ్యవసాయ కళాశాల, జిల్లెల), ఏఎంసీ వైస్ చైర్మన్ రాకేష్, వ్యవసాయ సహాయ సంచాలకులు జె.రామారావు, మండల వ్యవసాయ అధికారి వి.వినీత, ఏఈవోలు ,రైతులు పాల్గొన్నారు.

చందుర్తి : నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తారని రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం అన్నారు. చందుర్తి రైతు వేదికలో 15మంది రైతులకు వరి , పెసర వంటి న్యాణమైన విత్తనాలను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగుల లచ్చిరెడ్డి, వ్యవసాయాధికారిణి అనూష, ఏఈఈవోలు శారద, రమ్య, శిరీషా, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, మండల వ్యవసాయ అధికారి సందీప్, సింగిల్‌విండో డైరెక్టర్ కరెడ్ల రమేశ్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రుద్రంగి : రుద్రంగి రైతు వేదికలో అధికారులతో కలిసి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లెల బాబు జగ్జీవన్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.వెంకటరామ్, ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన



సిరిసిల్లటౌన్: ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ..మంగళవారం కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టారు. సిరిసిల్లలో గతంలో హంసవాహిని కళాశాల యాజమాన్యం ఉచితంగా చదివిస్తామని తమ ఇళ్లలోకి వచ్చి అడ్మిషన్లు ఇచ్చారన్నారు. ఒక సెమిస్టర్ పూర్తికాగానే సుమారు 550 మంది విద్యార్థులను వికాస్ డిగ్రీ కళాశాలలో కలిపిసే చేతులు దులుపుకున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి రూ. 5,500 చెల్లిస్తామని యజమాన్యానికి హామీ ఇచ్చి చెల్లించలేదని ఆరోపించారు. మూడేళ్లుగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సంబంధించిన ఫీజులు చెల్లించని హంసవాహిని కళాశాల డైరెక్టర్లు పట్టణంలో మరో కళాశాలను తీసుకుని పేరుమార్చి ఎలాంటి అనుమతులు లేకుండా కళాశాల నడిపించందుకు యత్నిస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఎండీ. సాకేద్, అరవింద్, భవాని, భావన, కావ్య, వర్ష, విద్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కోనరావుపేట: మండలకేంద్రంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సెస్ ఏఈ దివ్య తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేదికలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని వేములవాడటౌన్, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లోని వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని మండలాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సారుగమ్మ ఉత్సవాలు

ముస్తాబాద్: మద్దికుంటలో సారుగమ్మ ఉత్సవాలను మంగళవారం రాత్రి నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున సారుగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అంతకుముందు గ్రామస్తులు పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వానలు కురిసి, పిల్ల పాపలు బాగుండాలని, పాడి పంటలు పండాలని కోరారు.



ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించాలి



బోయినపల్లి: కోరెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు



వీర్నపల్లి: బంజేరులో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో నిర్మించాలని ఎంపీడీవో బీమ జయశీల, తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి కోరారు. మండలంలోని కోరెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఖాజా ముజాఫరుద్దీన్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ తంగళ్లపల్లి అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. నర్సింహులపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నేరెళ్ల సింగిల్‌విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పర్శరాములు, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంతో పేదోళ్ల ఇంటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. మండలకేంద్రంలోని దోసలగూడెం కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, ఈవో లక్ష్మణ్, నాయకులు మల్యాల రాజవీర్, వెంకటి, ప్రభాకర్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని బంజేరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు యూత్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పర్లపెల్లి దేవయ్య, నక్క శ్రీనివాస్, గుగులోత్ రవి, తుడుమ్ రవీందర్, లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

వేములవాడ: పట్టణంలోని ముదిరాజు వీధికి చెందిన యామ పోచయ్య– అనిత గతంలో మృతిచెందారు. వారి కూతురు శ్రీలేఖ వివాహానికి 98 చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ఫర్నిచర్ బీరువా, ఇతర వస్తువులకు రూ. 21వేల చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు హింగె శివం, సుమన్, నాగరాజు, శంకర్ ఉన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ



కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో మంగళవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీలో యోగా చేయండి, ఆరోగ్యంగా ఉండండి. ఆరోగ్యమే మహా భాగ్యం అంటూ నినాదాలు చేస్తూ యోగా వాక్ చేశారు. ఆయుర్వేద వైద్యురాలు కల్యాణి మాట్లాడుతూ జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఏఎన్ఎం దీపిక, యోగా శిక్షకులు అశోక్, పుష్పలత, ఆశా కార్యకర్తలు జమున, కరుణ, అనురాధ, సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలోని మూడోవార్డులో పోలీస్‌స్టేషన్ పక్కన డ్రైనేజీ దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు చెత్తాచెదారంతో నిండిపోయింది. మురుగునీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసనతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వృద్ధిచెంది రోగాలబారిన పడే అవకాశం ఉందని, వెంటనే మురుగుకాలువల్లోని నీటిని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట సెల్‌నెంబర్: 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తంగళ్లపల్లి : చింతలఠాణా రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు



వేములవాడరూరల్: రైతులనుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

- సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని చింతలఠాణాలో రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. మండలంలో చింతలఠాణా, గండిలచ్చపేటలో మొదటిరోజు రెవెన్యూ సదస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ ఈసరి ఉమరాజు, తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్ కుమార్, ఆర్‌ఐలు హరిప్రసాద్, దినేష్, పంచాయతీ కార్యదర్శులు వాణి, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, గండిలచ్చపేట, చింతలఠాణా గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అపరిష్కృతంగా వున్న భూ సమస్యల పరిష్కారానికి భూ భారతిని ప్రభుత్వం ప్రవేశ పెట్టి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సురేశ్ అన్నారు. చిప్పలపల్లి, కొండాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. చిప్పలపల్లిలో 52, కొండాపూర్‌లో 66 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ అ పర్ణ, ఆర్‌ఐలు రఘు, సుమలత, సిబ్బంది శ్రీనివాస్, నరేశ్, భవిత, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దొమ్మాటి నర్సయ్య పరిశీలించారు. తహసీల్దార్ సుజాత, ఆర్‌ఐ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని దుండ్రపల్లి, విలాసాగర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి మాట్లాడుతూ .. విలాసాగర్‌లో 50, దుండ్రపల్లిలో 8 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ భూపేశ్, ఆర్‌ఐ మనోజ్, ఎంపీఓ శ్రీధర్, అనిల్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జంగం అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల, జయవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఎదురుగట్లలో 21, జయవరంలో 8 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ అబుబాకర్ తెలిపారు. ఆర్‌ఐ బాలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: బావుసాయిపేట, కొలనూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులకు స్పందన లభించింది. తహసీల్దార్ వరలక్ష్మి ఆధ్వర్యంలో కొలనూర్‌లో, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బావుసాయిపేటలో దరఖాస్తులు స్వీకరించారు. ఆర్‌ఐలు సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట:కుర్దులింగంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మారుతిరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం ప్రజలనుంచి భూసమస్యల పరిష్కారం కోసం అర్జీలు స్వీకరించారు.

వీర్నపల్లి: అడవిపదిర, మద్దిమల్లలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అడవిపదిరలో తహసీల్దార్ ముక్తార్ పాషా, మద్దిమల్లలో డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై అధికారి రజిత ఆధ్వర్యంలో నిర్వహించారు. అడవిపదిరలో 65, మద్దిమల్లో 165 దరఖాస్తులు వచ్చాయన్నారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు

వేములవాడ: రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహరావు అన్నారు. మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధి 28 వార్డులకు చెందిన ముఖ్య నాయకులతో ఆయన తన నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన పనులను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. త్వరలోనే బూత్ స్థాయి, పట్టణ కమిటీలను నియమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రామతీర్థపు మాధవి రాజు, క్రాంతికుమార్, పోలాస నరేందర్, నరాల దేవేందర్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేశ్, నీలం శేఖర్, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి నిప్పంటించే యత్నం

- అప్రమత్తతతో తప్పిన ప్రమాదం..

వేములవాడ: పట్టణంలోని మార్కండేయనగర్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ ఇంటికి నిప్పంటించేందుకు యత్నించగా ఇంటి యజమాని అప్రమత్తంతో ప్రమాదం తప్పింది. ఎంద్రాల దేవయ్య నివాసానికి గుర్తు తెలియని వ్యక్తులు పైఅంతస్తు కింద భాగంలోనూ డీజిల్ చల్లి నిప్పంటించినట్లుగా బాధితుడు తెలిపాడు. ఇంటి వెనుక వైపు ఉన్న కట్టెలను అంటించే ప్రయత్నం చేశాడన్నారు. అర్ధరాత్రి కావడంతో ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి గమనించి యజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవయ్య తెలిపారు.

మూడిళ్లలో చోరీ

వేములవాడ: పట్టణంలోని సాయినగర్‌లో సోమవారం రాత్రి మరో మూడిళ్లలో చోరీ జరిగింది. ఇటీవల ఇదే వీధిలో నాలుగిళ్లలో చోరీ జరిగిన ఘటన మరువకముందే మరో మూడిళ్లలో దొంగతనం జరగడంతో ఈ ప్రాంతవాసులు భయపడిపోతున్నారు. ఇంటికి తాళం వేసి ఉంటే చాలు దొంగలు పడుతున్నారు. ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం అందించడంతో మంగళవారం పరిశీలించి వెళ్లారు. వరుస దొంగతనాలతో వేములవాడవాసులు వణికిపోతున్నారు.